క్లుప్తంగా

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తి పంచాయతీలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు అసెంబ్లీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఉజ్వల స్కీం గ్యాస్ కనెక్షన్‌లను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పులి నరేంద్ర కుమార్ రెడ్డి, ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, నాయకులు వెంకటరమణ, వెంకట్రాది పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పేదలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ప్రభుచరణ్

వాల్మీకిపురం: క్రిస్మస్ సందర్భంగా సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు ప్రభుచరణ్ నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. క్రిస్మస్ సమయంలో ప్రతి క్రైస్తవుడు తమ శక్తివంచన లేకుండా సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. క్రిస్మస్ ప్రపంచంలోనే అతి పెద్ద పండుగని, యేసుక్రీస్తు లోకానికి బోధించిన సేవ, దయ, జాలి, క్షమాపణ, ప్రేమ ప్రతి క్రైస్తవుడు పాటించి వాటిని ఆచరించాలన్నారు. క్రైస్తవులు అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నవోదయ పూర్వ విద్యార్థుల సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దంత, సాధారణ పరీక్షలతో పాటు మానసిక వైద్యులచే కౌన్సెలింగ్ ఇప్పించారు. బి.కొత్తకోట ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, రాధిక, నసీమ, నిహారిక, కృష్ణతేజలు హాజరై చికిత్స చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ వేళాయుధన్, లయన్స్ క్లబ్ రాజశేఖరరెడ్డి, పూర్వ విద్యార్థులు మోహన్‌వల్లి, శైలజ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు జయంతిని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె : రాష్ట్ర కురుబ, కురుమసంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న మదనపల్లె శ్రీరామ తులసీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న భక్త కనకదాసు 536వ జయంతి వేడుకలు, కురుబసంఘం 8వ వార్షికోత్సవ వేడుకలకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బలశ్రీనివాసులు కోరారు. ఆదివారం పట్టణంలోని కురుబసంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జబ్బల శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ.. మంగళవారం జరగనున్న కనకదాస జయంతి, కురుబసంఘం 8వ వార్షికోత్సవ వేడుకలకు దేశంలోని 10 రాష్ట్రాల నుంచి కురుమ, కురువ కులానికి చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. కురుబ కులానికి సంబంధించి గొప్పగా జరుగుతున్న కార్యక్రమాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి కులస్తులు అందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కప్పలరాజన్న, శ్రీనివాసులు, రామాంజులు, కుమార్, రెడ్డెప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏసుజననం సర్వలోకానికి మహోదయం

- క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం
- సర్వాంగ సుందరంగా చర్చిల ముస్తాబు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు



విద్యుత్ వెలుగుల్లో మదనపల్లె జేసీఎం చర్చి



ఆకట్టుకున్న క్రిస్మస్ ట్రీ

మదనపల్లె సిటీ: మెర్రీ మెర్రీ క్రిస్మస్...హ్యాపీ హ్యాపీ క్రిస్మస్ ..అంటూ క్రిస్మస్ పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకోనున్నారు. ఇందు కోసం జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాల్లోని చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ×పాకలోన ఏసు జన్మతో సందడాయే లోకమంతా పండుగాయే... ఏసుజననం సర్వలోకానికి మహోదయం. ప్రపంచశాంతికి చిహ్నం× అంటూ ప్రార్థనా గీతాలు ఆలపించారు. క్రిస్మస్ శుభ సందేశాన్ని పాస్టర్లు, ఫాదర్లు చర్చిల్లో వినిపించనున్నారు. పర్వదినాన్ని పురస్కరించుకుని పేదలకు అన్నదానం, వస్త్రదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జేసీఎం చర్చి... చరిత్రకు సాక్షి

క్రిస్మస్‌కు మదనపల్లెలోని క్రైస్తవ మందిరాలు ముస్తాబయ్యాయి. ఆధునిక హంగులతో విద్యుత్‌దీపాలంకరణలో మెరిసిపోతుంది. ఏళ్ల గడుస్తున్నా చెక్కుచెదరకుండా క్రైస్తవుల ప్రార్థనలకు వేదికలుగా నిలుస్తున్నాయి. ఇందులో జేసీఎం చర్చి 118 ఏళ్ల చరిత్ర ఉంది. ఏళ్ల తరబడిగా ఆధునిక నిర్మాణాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచింది. చారిత్రక కట్టడాలలో ఈ చర్చి ఒకటి. ఇది మదనపల్లె కీర్తి ప్రతిష్టలకు ప్రతీకగా పేరొందింది. భారతదేశంలో క్రైస్తవమత ప్రచారం, వైద్య సేవలందించేందుకు వచ్చిన అమెరికాకు చెందిన దొర డాక్టర్ జాకబ్ చాంబర్లీన్ 1903లో ప్రార్థనల కోసం చర్చిని నిర్మించాలని నిర్ణయించారు. మిత్రులు టీ.సుబ్బారెడ్డి, మురుగేశ మొదలియార్ల నుంచి స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో స్థలాన్ని కొని, 1905లో నిర్మాణం పూర్తి చేసి, క్రీస్తు సేవలకు అంకితం చేశారు. జేసీఎం చర్చిలో మదనపల్లెకు చెందిన క్రైస్తవులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు ప్రతి ఆదివారం జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు. ఇక్కడ ప్రతి ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్, క్రిస్మస్ వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతాయి. క్రిస్మస్, ఇతర ముఖ్య పండుగల సమయాల్లో లోపల, బయట సుమారు 2 వేల మంది వరకు ప్రార్థనలు చేసే అవకాశం ఉంది.

విద్యుత్ వెలుగుల్లో ..

క్రిస్మస్ పురస్కరించుకుని చర్చిని రంగు రంగు విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్చి ముందు పెద్ద స్టార్‌ను ఏర్పాటు చేశారు. చర్చి ఆవరణంలో 25 అడుగుల క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేశారు. ఇది అందరిని ఆకట్టుకుంటుంది. దీనిని ప్రత్యేక అలంకరణ చేశారు. చర్చిని చూసేందుకు పలువురు చర్చికి వస్తున్నారు.

సెయింట్ లూక్ చర్చి

స్థానిక తిరుపతి రోడ్డులో సెయింట్‌లూక్ చర్చి ఉంది. ఇది చాలా పురాతనమైనది. క్రిస్మస్‌కు చర్చిని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. దీంతో పాటు ఏఎంసీలోని చర్చి క్రిస్మస్‌కు అన్ని ఏర్పాటు చేశారు. చర్చిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఎంఎల్ఎల్ ఆస్పత్రి ఆవరణంలోని చర్చి, ఈస్టుపేటలోని చర్చి, బెంగుళూరు రోడ్డులోని ఆరోగ్యమాత చర్చిలు క్రిస్మస్‌కు ప్రత్యేకంగా అలంకరించారు.

56 ఏళ్లు పూర్తి చేసుకున్న స్టీన్ పాల్స్ చర్చి

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలోని గాంధీ రోడ్డులో ఉన్న స్టీన్ పాల్స్ చర్చి 56 సంవత్సరాలు పూర్తి చేసుకుని క్రిస్టమస్ వేడుకలకు ముస్తాబైంది. 1967 ఏప్రిల్ 16న స్టీన్ పాల్స్ చర్చిని అప్పటి బ్రిటీస్ దొర జె.ఎల్ మేయర్ నిర్మించడం జరిగింది. పీలేరులో పురాతన చర్చిగా పేరొందిన స్టీన్ పాల్స్ చర్చిలో క్రైస్తవులు అధిక సంఖ్యలో ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా క్రిస్టమస్ వేడుకలకు చర్చిని సిద్ధంగా చేశారు. విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అలాగే పీలేరు పట్టణంలో 15 చర్చిలు క్రిస్టమస్ వేడుకలకు ముస్తాబయ్యాయి.

కురబలకోటలో..

కురబలకోట: క్రిస్మస్‌కు నియోజక వర్గంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. అంతటా సందడి నెలకొంది. శాంతి, ప్రేమ, సహన ంకు ప్రతి రూపంగా క్రిస్మస్ వేడుకలు నిలవనున్నాయి. లోక రక్షకుడు క్రీస్తు పుట్టిన రోజును ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. అంగళ్లలోని సీయోను ప్రార్థన మందిరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆరాధన, ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



జేసీఎం చర్చి ప్రార్థనల్లో క్రైస్తవులు



పీలేరు: క్రిస్మస్‌కు ముస్తాబైన స్టీన్ పాల్స్ చర్చి

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

-ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె సిటీ: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో 10వ జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు జంగాల నందిని, సాయినాథ్, టీవీ కళ్యాణ్‌రామ్‌లను అభినందించారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లె క్రీడాకారులకు నిలయమన్నారు. ఎంతో మంది జాతీయ,రాష్ట్ర స్థాయిలో రాణించి మదనపల్లెకు గుర్తింపు తెచ్చారని గుర్తు చేశారు.పవర్ లిఫ్టింగ్‌లో నందిని, సాయినాథ్, కల్యాణ్‌రామ్‌లు పతకాలు తేవడంపై హర్షించదగ్గ విషయమన్నారు.వీరికి తనవంతు సహాయ,సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



వాల్మీకిపురం: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో ఆదివారం శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ మండపంలో షిరిడి సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేదపండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, ఉత్సవ మూర్తుల అలంకరణ చేశారు. అనంతరం వల్లిదేవ సేన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం: ప్రతి పల్లెకు రోడ్డు సౌకర్యం కల్పించాం, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాం, గ్రామాలను అభివృద్ధి చేశాం.. జరగబోయే ఎన్నికలలో మరోసారి ఆశీర్వదించాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని వెలిగల్లు గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి ప్రజలు మంగళ హారతులతో ఘనస్వాగతం పలికారు. గ్రామ పరిధిలోని వెలిగల్లు, కాయలపల్లె, గురికివాండ్లపల్లె, పాపదాత గారిపల్లె, కుడుములవారిపల్లె, నడింబురుజు, చాపలతురకపల్లె, నడింబురుజు హరిజనవాడల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. కాయలపల్లె, కుడుములవారిపల్లె, నడింబురుజు గ్రామాలకు తారురోడ్డు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. అలాగే పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించినట్లు తెలిపారు. అనంతరం వెలిగల్లులో గ్రామ సచివాలయం నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన సేవలను గ్రామస్థాయిలోనే అందించేందుకు ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ సేవలను సచివాలయంలోనే ప్రజలు పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీడీఓ శ్రీధర్ రావు, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు సరస్వతి, సోదనపల్లె బాషా, మొలక బయ్యారెడ్డి, కంటి విశ్వనాధరెడ్డి, ఎంపీటీసీ మంచూరి జయరాం, పార్టీ జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ కోసూరి రామక్రిష్ణ, మండల కన్వీనర్ చాంద్‌భాషా, గ్రామ సచివాలయ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిన్ని క్రిష్ణారెడ్డి, మొలక సాంబశివారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, నాయకులు ఆనందరెడ్డి, రవి, విజయభాస్కర, గుర్రం రామచంద్ర, రామిరెడ్డి, కేశవ, పీరాన్, మధురెడ్డి పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనం ముక్తిదాయకం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం: వైకుంఠ ద్వార దర్శనంతో భక్తజనం పులకరించింది. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఉపవాసం, జాగారం చేసి ఎంతో భక్తి శ్రద్ధలతో ద్వాదశి ఆదివారం రోజున వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. రంగురంగు విద్యుత్ దీపాలంకరణతో పాటు వివిధ రకాల పుష్పాలతో వైకుంఠ వాకలిని శోభాయమానంగా అలంకరించారు. ఈ ద్వారా భక్తులు ప్రవేశం చేసి స్వామివారిని దర్శనం చేసుకుని తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు భక్తులకు ఆలయ విశిష్టతను వివరించారు. దేశంలో వైకుంఠ ఏకాదశి రోజున అన్ని ఆలయాల్లో ఉత్తరముఖంగా ఉన్న వైకుంఠ ద్వారాలను తెరుస్తారన్నారు. అయితే ఈ క్షేత్రంలో భిన్నంగా నిత్యం ఉత్తర ముఖంగా ఉన్న మహద్వారం ద్వారా భక్తులకు దర్శన భాగ్యం కలుగుతుందన్నారు. ఇక్కడ స్వామివారిని ఏ రోజుల్లో దర్శించుకున్నా వైకుంఠ ద్వార దర్శనం ఫలం దక్కినట్టేనన్నారు. అందుకే ఇక్కడ వైకుంఠ ఏకాదశి మరుసటి రోజైన ద్వాదశిరోజున ద్వాదశి రోజున ఇక్కడ పశ్చిమ ముఖ్యంగా ఉన్న వైకుంఠ ద్వారాలను తెరుస్తారన్నారు. ఏకాదశి రోజున భక్తులు జాగారం, ఉపవాస దీక్షలను తీసుకొని ఎంతో భక్తిశ్రద్ధలతో ద్వాదశి రోజున వైకుంఠ ద్వార దర్శనం చేసుకొని దీక్షలను విరమించడం ఇక్కడ ప్రాధాన్యాతాంశమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండ ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని ఆలయ ఈఓకు అందజేస్తున్న దాతలు



సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డెమ్మకొండ ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం చిన్నసింగంపల్లెకు చెందిన రెడ్డి గురుజాన్విక రూ.25,116, మదనపల్లెకు చెందిన రెడ్డిప్రత్యూష శ్రీ, వెంకటరమణ దంపతులు రూ.25116 విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయానికి విచ్చేసిన దాతలకు ఆలయ ఈఓ మంజుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలకు తీర్థప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించారు. దాతలు ఇచ్చిన మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరిగ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు ఈఓ తెలిపారు.

వరాల తల్లీ..కరుణించమ్మా

వరాల తల్లీ.. కరుణించమ్మా అంటూ భక్తుల నినాదాలతో మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం మారుమోగింది. అమ్మవారి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. భక్తులు అమ్మవారికి చీరె,సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు.

ఘనంగా మలయప్పస్వామి ఊరేగింపు



మలయప్పస్వామిని గరుడవాహనంపై ఊరేగిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పూజా కార్యక్రమాల్లో భాగంగా మలయప్ప స్వామి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. స్థానిక కోటపల్లెలో శ్రీ పద్మావతి ఆండాల్ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రెండు రోజుల పాటు విశేష పూజల నిర్వహించారు. ఆదివారం స్వామి వారిని గరుడవాహనంపై ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జి.వి. రాకేష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, రాజేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భానుమతి గ్రంథావిష్కరణ



భానుమతి నవలను ఆవిష్కరిస్తున్న రచయితలు

మదనపల్లె సిటీ: ప్రముఖ రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు ఎం.వి.పాపన్నగుప్తా రచించిన భానుమతి నవలను ప్రముఖ రచయిత, ఆకాశవాణి విశ్రాంత ఉప సంచాలకులు నాగసూరి వేణుగోపాల్ ఆవిష్కరించారు. ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో స్థానిక జ్ఞానోదయ పాఠశాలలో ఆదివారం భానుమతి నవల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కాలమాన పరిస్థితులను అద్దం పడుతూ భానుమతి నవల రచించినట్లు తెలిపారు. 95 ఏళ్ల నాటి అమూల్య గ్రంథం ద్వితీయ ముద్రణ జరుపుకోవడం అభినందనీయమన్నారు. రచయిత పద్యాలు, వ్యాసాలు, కథలతో పాటు భానుమతి నవల రచించారన్నారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య స్రవంతి అధ్యక్షులు తిరుపతిరావు, కార్యదర్శి నాగభూషణరావు, ప్రముఖ రచయితలు టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి, అబ్దుల్‌ఖాదర్, కవితశ్రీ, కనక సభాపతి, వెంకట నరసింహులు, పాపన్నగుప్తా కుమారుడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరు : రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాజంపే ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. సింగిల్‌విండో చైర్మన్‌గా నారే వెంకటరమణారెడ్డి, డైరెక్టర్లుగా స్టాంపుల మస్తాన్, తిమ్మయ్య ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ బ్యాంకులతో సమానంగా డీసీసీ బ్యాంకు ద్వారా రైతులకు వ్యవసాయ రుణాలు, వడ్డీలేని రుణాలు విరివిగా ఇస్తున్నట్లు తెలిపారు. రైతుల ఆర్థికాభివృద్ధికి సహకార సంఘాలు బలోపేతం కావాలని కోరారు. అనంతరం స్థానిక మదనపల్లె మార్గంలోని ఏపీఐఐసీ లేఅవుట్‌3 నందు దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, నల్లారి తిమ్మారెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఎంపీపీ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జీనత్‌షఫీ, నాయకులు జి.వి. రాకేష్‌రెడ్డి, హబీబ్‌బాషా, హుమయూన్, దండు జగన్‌మోహన్‌రెడ్డి, షాకీర్, చైతన్యరెడ్డి, చలపతి, సునీల్‌రెడ్డి, అమరనాథరెడ్డి, చంద్రరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్ కుటుంబీకుల ఆత్మీయ సమ్మేళనం



మల్లయ్యకొండ ఆలయంవద్ద టీఎన్ కుటుంబీకులు

తంబళ్లపల్లె: రాష్ట్రంలోనే రాజకీయంగా, పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధిలో గుర్తింపు పొందిన టీఎన్ కుటుంబీకులు ఆదివారం స్వగ్రామం తంబళ్లపల్లె మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమ్మేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మల్లయ్య కొండ అభివృద్ధికి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. మాజీ ఎమ్మెల్యే టీఎన్ శ్రీనివాసులు రెడ్డి సతీమణి, మాజీ ఎంపీపీ టీఎన్ ప్రమీళమ్మ ఆధ్వర్యంలో టీఎన్ బంగ్లాలో ఆత్మీయ కార్యక్రమం జరిగింది. నాటి ఉమ్మడి మద్రాసు అసెంబ్లీలో టీఎన్ రామక్రిష్ణారెడ్డి ఎమ్మెల్యేగా రాణిస్తూ నాటి శ్రీబాగ్‌వడంబడిక ఒప్పంద పత్రంలో కమిటీ సభ్యునిగా సంతకం చేయడం విశేషం. టీఎన్ విశ్వనాథ్ రెడ్డి రాజంపేట ఎంపీగా ఏకగ్రీవంగా ఎంపికై పార్లమెంట్‌లో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేతులమీదుగా సన్మానం పొందారు. టీఎస్ వెంకట సుబ్బారెడ్డి, టీఎస్ అనసూయమ్మ ఎమ్మెల్యేలుగా రాణించారు. టీఎస్ నాగిరెడ్డి ఉమ్మడి చిత్తూరు జడ్పీ చైర్మన్‌గా రాణించారు. తంబళ్లపల్లెలో వైద్య విధాన పరిషత్, ఆర్టీసీ బస్టాండు అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా భూములు వితరణగా ఇచ్చిన ఘనత టీఎన్ కుటుంబీకులదే. టీఎన్‌కుటుంబీకులు కూడా వ్యాపార రీత్య విదేశాలలో ఉన్నారు. పలువురు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. నాటి టీఎన్ బంగ్లా భవంతులను సందర్శిస్తూ తీపి గుర్తులను పంచుకున్నారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి కుమార్తె అమరమ్మ, తిరుపతి మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి, టీఎన్ విజయనారాయణరెడ్డి, దినకర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సోక్రటీస్ తంధై పెరియార్

మదనపల్లె : సమాజంలో సమధర్మానికి బాటలు వేసిన వేగుచుక్క తంధై పెరియార్ ఆధునిక సోక్రటీస్ అని భారతీయ అంబేడ్కర్ సేన(బాస్), వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ అన్నారు. పెరియార్ 50వ వర్ధంతి సందర్భంగా ఆదివారం బాస్, వీసీకే పార్టీ ఆధ్వర్యంలో సంయుక్తంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీటీఎం.శివప్రసాద్ మాట్లాడుతూ సామాజిక విప్లవ ఉద్యమ నిర్మాతగా, మూఢనమ్మకాలకు, అజ్ఞానానికి, దుర్మార్గపు ఆచారాలు, అనాగరిక వ్యవహారాలకు ఆగర్భశత్రువుగా పెరియార్ నిలిచారన్నారు. పెరియార్‌ను పాశ్చాత్య దేశాలు ఆధునిక సోక్రటీస్‌గా గుర్తించాయని, యునెస్కో దక్షిణాసియా సోక్రటీస్‌గా అభివర్ణించిందన్నారు. గొప్ప సంఘసంస్కర్తగా పేరుపొందిన తంధై పెరియార్ సిద్ధాంతాలను ప్రస్తుత యువత చదవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ కృష్ణప్ప, బాస్ కన్వీనర్ ముత్యాలమోహన్, రవిశంకర్, పీరు, శశి, రెడ్డి ప్రసాద్, భార్గవ్, రవి, లోకేష్, శ్రీకాంత్, హైదరవల్లి తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ కలయిక

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1980–81లో పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 42 ఏళ్ల తరువాత అందరూ కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, సుశీలమ్మ, గంగాదేవి, వసుంధరలను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు